గణపయ్యకు పూజలు, నిమజ్జనం


పూజ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత


పాతపాలెంలో వేలం పాటలో దక్కించుకున్న లడ్డుతో భక్తులు


ధరూరులో రూ.25వేలకు లడ్డు దక్కించుకున్న భక్తుడు


శాంతినగర్‌లో పూజలు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ


జూలెకల్‌లో వినాయకుడి మండపంలో భక్తులు

సొంతూరులోనే 'ఉపాధి'

- యూనిట్ల వారీగా నిధులు
- వ్యవసాయ రంగానికి ఊతం
- అన్నదాతలకు మరింత మేలు
- వినియోగించుకుంటే లాభం


గువ్వలదిన్నెలో ఉపాధిహామీ కింద నిర్మించిన షెడ్డు

కేటీదొడ్డి: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి సొంత ఊర్లలో పని కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం అమలు చేస్తోంది. కాలనుగుణంగా పలు నూతన పనులను పథకంలో చేర్చుతూ కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. గ్రామాల్లో చెరువులు, కాలువల వద్ద మొక్కలు పెంపకం చేపట్టడంతో పాటు రెండేళ్లుగా పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటోంది. రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకుంటే లాభాలు పొందవచ్చని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలోని 11,730 జాబ్‌కార్డులుండగా, 7,132 యాక్టివ్‌లో ఉన్నాయి. 8,872 మంది కూలీ లున్నారు.

యూనిట్లు.. నిధులు

■ పౌల్ట్రీ షెడ్డు: ఈ యూనిట్ విలువ రూ.65 వేలు రైతు షెడ్డు నిర్మించుకుని 100 నాటు కోడిపిల్లలను పెంచాల్సి ఉంటుంది.

■ పశువుల పాకలు: యూనిట్ విలువ రూ.96 వేలు తప్పనిసరిగా మూడు పశువులు ఉన్నవారికే ప్రాధాన్యత కల్పిస్తారు.


ఇర్కిచేడులో నిర్మించిన పశువుల పాకను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

■ మేకలు, గొర్రెల షెడ్డు: యూనిట్ విలువ రూ.70 వేలు 10 గొర్రెలు లేదా మేకలు ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

■ ఇంకుడుగుంతలు: యూనిట్ విలువ రూ.6,500

■ అజోల్లా పెంపకం: యూనిట్ విలువ రూ. 20 వేలు రైతులకు మాత్రమే ఇది వర్తిస్తుంది.

■ వర్మీ కంపోస్టు గుంతలు: యూనిట్‌కు విలువ రూ.15 వేలు (సామూహికంగా లేదా వ్యక్తిగతంగా రైతులు ఈ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చు)

ఇవీ నిబంధనలు..

ఎస్సీ, ఎస్టీ రైతులకు సాగులో లేని భూముల అభివృద్ధి, రైతులకు ఉపయోగపడే పలు వ్యక్తిగత పనుల కోసం ఉపాధిహామీ పథకాన్ని వినియోగించుకోవచ్చు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం మంజూరైన పనులు చేయాల్సి ఉంటుంది. వివిధ యూనిట్లకు కూలీ సామగ్రి ఖర్చులు కలిపి అందించనున్నారు. మండలస్థాయిలో ఏపీఓ, ఈసీ, టీఏ లేదా గ్రామస్థాయిలో క్షేత్ర సహాయకులు లేదా పంచాయతీ కార్యదర్శులకు కావాల్సిన ధ్రువపత్రాలు జత చేసి దరఖాస్తులు అందించాలి.

"సద్వినియోగం చేసుకోవాలి..



ఉపాధిహామీ పథకంలో వ్యవసాయంలో ఉపయోగపడే పనులు మంజూరు చేస్తున్నాం. రైతులు ఆయా మండలాల్లోని సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

– కుమార్, ఏపీఓ, కేటీదొడ్డి

ఆకట్టుకున్న తోలుబొమ్మలాట


తోలుబొమ్మలాట దృశ్యం


కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

గద్వాల న్యూటౌన్: అంతరించిపోతున్న తొలుబొమ్మలాట ప్రదర్శించడంతో చూపరులు ఆసక్తిగా తిలకించారు. తోలుబొమ్మలాట ఆడించిన కళాకారులకు చప్పట్లు, కేరింతలతో అభినందనలు తెలిపా రు. పట్టణంలోని బసవన్నచౌరస్తాలో చత్రపతి సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుడి మండపంలో ఆదివారం సాయంత్రం తొలుబొమ్మలాట ఏర్పాటు చేశారు. రామాయణంలోని సుందరకాండ భాగాన్ని తోలుబొమ్మలాట ద్వారా ధరూర్, గట్టు మండలం తప్పెట్ల మొర్సు గ్రామాలకు చెందిన కళాకారులు రమేష్, నర్సింహులు, రామలక్ష్మణ్, భాస్కర్‌లతో పాటు పలువురు మహిళలు తోలుబొమ్మలాట ప్రదర్శించారు. ప్రదర్శన అనంతరం అమరాయి శ్రీరాములు దంపతులు కళాకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రత్నసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సంగాల పవన్, వాసు, సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు మందుల పంపిణీ



అయిజ: మండలంలోని ఉప్పల గ్రామంలో ఆదివారం మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఆదిత్య హాస్పిటల్ వైద్యుడు పీజీ శ్రీనివాస్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు జ్వరం, మలేరియా, బీపీ, షుగర్, వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పండ్ల పంపిణీ



అయిజ: బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్వీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బజారి, చిన్న, జాన్, మహేష్, తిరుమలేష్ పాల్గొన్నారు.

సమస్యల్లో గ్రామాలు



ఇటిక్యాల: గ్రామాలు సమస్యలకు నిలయాలుగా మారాయని బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని బుడ్డారెడ్డిపల్లిలో ఆ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపడంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు వెంటనే స్పందించి గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి ఉచిత వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట వెంకటరాముడు, రామకృష్ణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమాన్‌పై కేసు నమోదు

మానవపాడు: పింఛన్ కోసం వచ్చిన ఓ వితంతు వృద్ధురాలిపై పోస్టుమాన్ దాడి చేసిన ఘటనలో, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. మండలంలోని చెన్నిపాడు గ్రామంలో పింఛన్ కోసం వెళ్లిన పద్మావతి (వృద్ధురాలు)పై శనివారం పోస్టుమాన్ దాడి చేశాడు. ఈ సంఘటనపై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మల్దకల్: మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్‌లో 1991–92లో పదో తరగతి పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 33ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనానికి విశ్రాంత ఉపాధ్యాయులు వీరన్న, వెంకట్రాములు, వెంకటమ్మ, సత్యనారాయణ, చెన్నకేశవులు, తిమ్మారెడ్డితో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. వారిని పూర్వపు విద్యార్థులు పూలమాలలు, శాలువాతో సత్కరించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో గురునాథ్, తిరుపతిరెడ్డి,నర్సింహులు, సుధాకర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, శ్రీధర్, దేవన్న, తిప్పన్న, నారాయణరెడ్డి, పాపిరెడ్డి, భాస్కర్‌గౌడు, రాముడు, శ్రీనివాసశెట్టి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన

మానవపాడు: మండలంలోని కొర్విపాడు, ఏ.బుర్ధిపాడు, మద్దూరు గ్రామాలలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బెస్‌మెంట్ లేవల్ పూర్తయిన వారికి రూ.1లక్ష వచ్చిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, జిల్లా డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు చెక్కులకే పరిమితమా?



మానవపాడు: అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ప్రజలు, లబ్ధిదారులు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, మరణించిన వారిని చూడడానికి ఎమ్మెల్యే విజేయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి వెళ్తారే తప్ప గ్రామాల్లో అభివృద్ధి చేయడంలో మాత్రం శూన్యమని నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, జిల్లా డీసీసీ కార్యదర్శి సిరాజ్ అహ్మద్, రాష్ట్ర రోడ్డు రవాణా మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కొరివిపాడు, ఏ. బుర్ధిపాడు, మద్దూరు గ్రామాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో బ్రహ్మానందంరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, పరమేష్‌నాయుడు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు సౌకర్యం, రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని, అలాంటి పార్టీని ప్రజలు ఆదరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రాధమ్మ, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ గౌడు, రమణ, నరేందర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ స్పెషల్ క్లాసులు

ధరూరు: 10వ తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి స్పెషల్ క్లాసులు నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు స్పెషల్ క్లాసులను నిర్వహించన్నుట్లు వారు తెలిపారు. కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా అన్ని ఉన్నత పాఠశాలల్లో స్పెషల్ క్లాసులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం


గద్వాలలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: ప్రధాని నరేంద్రమోదీ తల్లి పట్ల కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు ఖండించారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. పాతబస్టాండ్ చౌరస్తాలో రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మ దహనం చేశారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు మాట్లాడారు. ప్రధాని మోదీ మాతృమూర్తి పట్ల రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తక్షణమే రాహుల్‌గాంధీ ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళన ఉధృతం కాకుండా కొంతమంది బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, శ్యామ్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, పాండు, సాయి, మోహన్‌రెడ్డి, రమేష్, తిమ్మన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాల్వకు నీరు విడుదల చేయాలి

కేటీదొడ్డి: ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని చివరి ఆయకట్టు వరకు విడుదల చేయాలని కేటీదొడ్డి, నందిన్నె రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నందిన్నె, కేటీదొడ్డి రైతుల వరి, ఇతర పంట ఎండిపోతుందంటూ కాల్వలను చూపిస్తూ సోషల్ మీడియాలో వచ్చిన వీడియో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా ర్యాలంపాడు రిజర్వాయర్ కింద ఉన్న డీ9 కాల్వల ర్యాలంపాడు నుంచి చివరి ఆయకట్టు నందిన్నెకు కాల్వల ద్వారా నీరు వస్తలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వల కింద వరి, పత్తి మొదలగు పంటలు సాగుచేస్తున్నామన్నారు. జూరాల ప్రాజెక్టుకు రోజు ఎగువ నుంచి వర్షం నీరు వస్తున్నా పక్కనే ఉన్న కాలువలకు నీరు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాలువ చివరి ఆయకట్టు నందిన్నె వరకు నీరు వచ్చేలా చేయాలని రైతులు కోరారు.


కాలువ ద్వారా నందిన్నె చివరి ఆయకట్టు వరకు నీటిని విడుదల చేయాలి

కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యం

ఎర్రవల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని గార్లపాడు, కారుపాకుల, దువాసిపల్లి, షేకుపల్లి, తదితర గ్రామాలను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులు చూసి ప్రజలే స్వచ్ఛందంగా కాంగ్రెస్‌కు జై కొడుతున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సోమనాద్రి, రుక్మాందర్‌రెడ్డి, మధునాయుడు, నర్సింహారెడ్డి, బీసన్న, ఉస్సేన్, తదితరులు ఉన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న నాయకులు

మహిళలంటే గౌరవం లేదు

ఎర్రవల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకులకు మహిళలంటే ఎలాంటి ప్రేమాభిమానాలు, గౌరవం లేదని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కూడలిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బండల వెంకట్‌రాముడు, కేకేరెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం , లక్ష్మన్నగౌడ్, కృష్ణరాజు, నరేష్, నవీన్, వేణుచారి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు

బీజేపీ నాయకులు ముందస్తు అరెస్ట్

అయిజ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం చేసేందుకు యత్నిస్తుండగా బీజేపీ నాయకులను పోలీసులు ఆదివారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో భగత్ రెడ్డి, ప్రదీప్ కుమార్, వెంకటేష్ ఉన్నారు.

శాంతినగర్: రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ద హనం చేసేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ నా యకులను శాంతినగర్ పోలీసులు అరెస్ట్ చే శారు. బీజేపీ నాయకులు నరసింహ, బీకే శ్రీను, రంగస్వామి, పరశురాముడులను స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గట్టు: మండలంలోని మాచర్ల ఉన్నత పాఠశాలలో ఈ నెల 3న మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జై నడిగడ్డ యువత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు మాత్రమే హాజరు కావాలని జై నడిగడ్డ యువత కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.5016, ద్వితీయ బహుమతి రూ.3016, తృతీయ బహుమతి రూ.1516లను అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సుంకులమ్మ ఆలయంలో చోరీకి యత్నం



ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో సుంకులమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తి హుండీ చోరీ చేసేందుకు యత్నించగా సీసీ కెమెరా సైరన్ మోగడంతో అక్కడి నుంచి తప్పించుకున్నట్లు స్థానికులు తెలిపారు. సీసీ కెమెరా ఉంటే చోరీలు జరుగుతాయని, కాని సైరన్ మోగడంతో దొంగ భయంతో పరారైనట్లు సీసీ టీవీలో కనబడినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించినట్లు తెలిపారు. ఎలాంటి వస్తువు చోరీకి గురి కాలేదని పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం



మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన రవి ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రి 108లో విధులు నిర్వహిస్తున్న రవి గత నెలలో పరుమాల స్టేజి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచి విధులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. దీంతో తోటి 108సిబ్బంది ఆయన పరిస్థితిని గుర్తించి తమవంతుగా రూ.16వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో 108జిల్లా మేనేజర్ రత్నమయ్య, ఈఎంటీ రాధామోహన్, కృష్ణ, శ్రీశైలం, శ్రీధర్, ఆంజనేయులు, లవకృష్ణ ఉన్నారు.

పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎర్రవల్లి: పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలకు నిలయాలుగా గ్రామాలు మారాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వెంకట్‌రాముడు, రామకృష్ణ, సతీష్, తదితరులు ఉన్నారు.


ఎర్రవల్లిలో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్

అదనపు గదులకు నిధులు కేటాయించాలి



గట్టు: గట్టులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి నిధులను కేటాయించాలని ఇన్‌చార్జి హెడ్మాస్టర్ నర్సింహులుగౌడు, గ్రామ స్వరాజ్యం కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రాజుసాగర్‌లు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆదివారం గద్వాలకు వచ్చిన ఎమ్మెల్సీని కలిసి వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. గట్టు ఉన్నత పాఠశాలలో అదనపు గదుల కొరత తీవ్రంగా ఉందని, అదనపు గదుల నిర్మాణానికి నిధులను కేటాయించాలని విన్నవించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్సీ దీనికి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

రేపు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

మల్దకల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో మంగళవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, పీడీ సువాసినిలు తెలిపారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు నిర్వహించే ఈ క్రీడాపోటీల ఎంపికకు ఆయా పాఠశాలల విద్యార్థులు బోనోఫైడ్, ఆధార్‌కార్డుతో మంగళవారం ఉదయం 9గంటల వరకు మల్దకల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హాజరుకావాలని వారు కోరారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించుకుందాం

గద్వాల: భారత ఉపరాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించుకుందామని అఖిలపక్ష కమిటీ, ప్రజాసంఘాల నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఇక్బాల్‌పాషలు అన్నారు. ఆదివారం ప్రజాస్వామ్యం పట్ల విశేషగౌరవ మర్యాదలు, నిజాయితీ గల మేధావి అయిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం సెప్టెంబర్ 1న సాయంత్రం 4గంటలకు స్థానిక టీజేఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు హాజరు కావాలన్నారు.

మాతాజీలకు నోట్ బుక్స్ పంపిణీ



శాంతినగర్: జనహిత మాతాజీలకు సంచ్ అధ్యక్షుడు గాయత్రి శ్రీనివాసులు, విశ్వహిందూపరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం నోట్‌పుస్తకాలు అందజేశారు. స్థానిక ఆదినారాయణస్వామి ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో 30 గ్రామాలకు చెందిన ఆచారి మాతాజీలకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంచ్ కార్యదర్శి చిన్నరాముడు, సంతు ఉపాధ్యక్షుడు రవీంద్రాచారి పాల్గొన్నారు.

చెట్లకొమ్మలు తొలగింపు

మానవపాడు: మండలంలోని 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మానవపాడు నుంచి కలుకుంట్ల గ్రామం వరకు చెట్టుకొమ్మలు, ఇన్సులేటర్ల మార్పు ఉన్నందున సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నవీన్‌బాబు, ఏఈ సుబ్బరాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవపాడు, అమరవాయి, నారాయణపురం, పెద్దఆముదాలపాడు, గోకులపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చెన్నిపాడు, గ్రామాల్లో సరఫరా ఉండదని తెలిపారు.